క్లుప్తంగా

రేపు రాజువారిపేటలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజువారిపేట గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఎస్టీయూలో చేరిన ఉపాధ్యాయ సంఘ నేతలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, బద్వేలు ప్రాంతాలనుంచి ఇతర ఉపాధ్యాయ సంఘాలకు చెందిన ముఖ్యనేతలు ఎం.శేఖర్‌బాబు, రామసుబ్బయ్య, బిఎస్‌వి ప్రసాద్, కె.సత్యనారాయణ, వై.నాగిరెడ్డి శుక్రవారం ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి సమక్షంలో ఎస్టీయూలో చేరినట్లు జిల్లా కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని వినతి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీలోని మూడవ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి తమను నోటికొచ్చినట్లు దూషిస్తున్నారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణకు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, కోశాధికారి రాఘవేంద్ర, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని వెంచర్లను తొలగించాలి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె పంచాయతీ సుందరయ్య నగర్ కాలనీ పరిధిలో అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్లను, అక్రమ నిర్మాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి గురుమోహన్‌కు శుక్రవారం సీపీఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ సర్వే నంబర్ 667, 668-1, 2, 3, 4లోని భూమిలో అక్రమంగా వెంచర్లు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షరీఫ్, గంగాధర్ పాల్గొన్నారు.

రహదారి భూముల సర్వే

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు, రాజుపాళెం, సోమాపురం, వెంగళాయపల్లె, పగిడాల, గోపాయపల్లె గ్రామాల మీదుగా వెళుతున్న నేషనల్ హైవే చుట్టూ పొలాల సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ఆయా గ్రామాల్లోని సచివాలయ సర్వేయర్లు, వీఆర్ఏలు కొలతలు వేస్తుండగా మండల సర్వేయరు గురుశేఖర్ రెడ్డి మానిటరింగ్ చేస్తున్నారు. ఏఏ సర్వే నంబర్‌లో ఏమేరకు పొలం రహదారికి పోతోందో సర్వే చేస్తున్నారు. త్వరలో వివరాలు వెల్లడిస్తామని డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథ రెడ్డి తెలిపారు.

నేడు న్యాయ సలహా కేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బీసీ ప్రజాచైతన్య సమాఖ్య కార్యాలయంలో శనివారం సాయంత్రం బీసీ ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు బోర్ర రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ అధికారి యాదగిరి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడురెడ్డి మారుతిప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు.

31 మంది విద్యార్థులు ఎంపిక

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 31 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎల్.వీరాంజనేయరెడ్డి తెలిపారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్, యూఎస్ఏ ఆధారిత ఏపీ సోర్స్ మెడికల్ కోడింగ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహించారు. ఏపీ సోర్స్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ యేడాదికి రూ.2.5 లక్షల ప్రారంభ వేతనంతో 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఏపీ సోర్స్ ప్రతినిధులు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించాలని కోరారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

కడప అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఏఆర్ ఎస్ఐ కె. రామమోహన్ కుటుంబానికి ఎస్పీ రూ. 2.25 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఇందులో పోలీసు విత రణ నిధి నుంచి రూ. 2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన టి. సుదర్శన్ సతీమణి సువర్ణకు రూ. 2 లక్షలు, ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ. 25 వేలు అందజేశారు. వాటర్‌బాయ్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పి. రెడ్డెయ్య సతీమణి పి. తులశమ్మకు రూ. 2.50 లక్షలు ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందచేశారు. ఇందులో పోలీసు విత రణ నిధి నుంచి రూ. 2 లక్షలు, విడో ఫండ్ రూ. 50 వేలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ప్రొద్దుటూరు కల్చరల్ : వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహిళలు పలు ఆలయాలలో, ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా అగస్త్యేశ్వరునికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలను వేదపండితులు నిర్వహించారు. విశేషంగా రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను వట్టివేరుతో రూపొందించిన గజమాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను బంగారుచీరెతో అలంకరించారు.



ప్రొద్దుటూరు : వట్టివేరు అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



ప్రొద్దుటూరు: బంగారు చీరె అలంకరణలో వాసవీమాత

అమ్మవారిశాలలో వరలక్ష్మి వ్రతం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక అమ్మవారిశాలలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాత్యా, పసుపుల లక్ష్మీ, సుష్మ కేతేపల్లి, జయప్రద తదితర ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

వెల్లాలలో..

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వైభవంగా జరిగింది. ఆలయ మాజీ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. దద్దనాలకు చెందిన గోపిరెడ్డి మహానందిరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మండలంలోని కాలువకట్ట తిరుమల గిరిపై వెలసిన లక్ష్మీదేవి, గోదాదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తిరుపాలయ్య భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానాలలో శుక్రవారం శ్రీ వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు తులసి సురేష్‌బాబు, జనార్దనసెట్టి ఆధ్వర్యంలో అర్చకులు కిశోర్‌శర్మ సాంప్రదాయబద్ధంగా వ్రతాన్ని మహిళలతో ఆచరింపచేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ అధ్యక్షులు పెసల నరసింహులు ఆధ్వర్యంలో జరిగింది. మధ్యాహ్నం భక్తులకు భోజనవసతి కల్పించారు.

అల్లాడుపల్లెలో..

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పండితుడు నరేంద్ర శర్మ పర్యవేక్షణలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. శ్రావణ మాస శుక్రవారం సందర్భంగా భద్రకాళీ మాత అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు భరత్ శర్మ, గోవిందులు వరలక్ష్మీ వ్రత విశిష్టతను తెలియజేశారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చియ్యపాడులో..

చియ్యపాడు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నిరంజన్ రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

మైదుకూరు : పట్టణంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలయాల్లో దేవతామూర్తుల మూలవిరాట్‌లకు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. పాత ఊర్లో గ్రామ దేవత పెద్దమ్మతల్లికి వెండి చీరతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీమాతకు రత్నాల వజ్రపు చీరను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్ళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రొద్దుటూరు : అమ్మవారిశాలలో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళలు



రాజుపాళెం : అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



పోరుమామిళ్లలో అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



చాపాడు : అల్లాడుపల్లె వీరభద్ర స్వామి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఇరువురికి స్థానం



జిల్లా ప్రధాన కార్యదర్శి బిజివేముల రామసుబ్బారెడ్డి



జిల్లా కార్యదర్శి ఈగయద్దారెడ్డి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కమిటీలో బద్వేలు ప్రాంతానికి చెందిన ఇరువురికి స్థానం దక్కింది. బద్వేలు మండలం తిరువెంగళాపురం గ్రామానికి చెందిన బిజివేముల రామసుబ్బారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుకు చెందిన ఈగయద్దారెడ్డి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన కడప ఎంపీ వైఎస్అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్చకులకు వేతనాల మంజూరు హర్షనీయం

చాపాడు : రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో ఉండే 501 దేవాలయాలకు అర్చక భృతి కింద ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున తిరుమల తిరుపతి దేవస్థానం తరపున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయించడం హర్షనీయమని జిల్లా దళిత ఆలయాల అర్చక సంఘం ప్రతినిధి వెంకట సుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పూజలకు, దీపదూప నైవేద్యాలకు నోచుకోని వందలాది బడుగు నివాస ప్రాంతాల్లోని హిందూ దేవాలయాల వికాసానికి అర్చక భృతి ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి నిర్ణయం ప్రభుత్వం తీసుకోవటం గొప్ప విషయమని తెలియజేశారు.

6 నుంచి జిల్లాస్థాయి చెస్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిరాఫీ చెస్ అకాడమిలో జిల్లాస్థాయి బాలుర జిరాఫీ చెస్ పోటీలను సెప్టెంబరు 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు దస్తగిరి రాజ తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008 తరువాత పుట్టిన 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరు అర్హులని, ఆసక్తిగలవారు ఈ నెల 31లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 73964 19042 కు సంప్రదించాలని కోరారు.

గడప గడపకు కడప డీసీసీ బ్యాంకు సేవలు

గోపవరం : రైతులు, పేదలు, గ్రామీణాభివృద్ధే మా ధ్యేయం అనే నినాదంతో కడప డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్ళి సేవలను ప్రజలకు వివరించారు. శుక్రవారం మడకలవారిపల్లెలో బద్వేలు బ్రాంచ్ మేనేజర్ జె.కళావతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు గడప గడపకు వెళ్ళి అతితక్కువ నగదుతో బ్యాంకులో సేవింగ్ ఖాతా నమోదు చేసుకోవచ్చన్నారు. రూ.3 లక్షల వరకు 7 శాతం వడ్డీతో రైతులకు పంట రుణాలు అందజేయడం జరుగుతుందని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన యెడల 0.33 పైసలు వడ్డీ మాత్రమే పడుతుందన్నారు. డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కంటే అధిక శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సామాజిక బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ సేవలు అర్హత కలిగిన ప్రతి రైతుకు సబ్ రిజిస్ట్రార్ విలువ రూ.35 లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని, కేవలం 83 పైసలు వడ్డీ మాత్రమే పడుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణ, మండల పరిధిలో గృహ నిర్మాణాలకు నిబంధనల మేరకు రూ.25 లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బంగారు నగలపై తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, స్వయం సహాయక సంఘాలకు 75 పైసలు వడ్డీకే ఎటువంటి ఖర్చులు లేకుండా రూ.25 లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. చిరు వ్యాపారులకు సులభవాయిదాలపై రూ.3 లక్షల వరకు రుణాలు, గ్రామీణ ప్రాంత గృహ నిర్మాణాలకు రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బ్యాంకు సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని బ్యాంకు మేనేజర్ కళావతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఈఓలు పాల్గొన్నారు.

మినుము, జొన్న విత్తనాల కోసం ప్రతిపాదనలు

చాపాడు : మండల పరిధిలోని ఆరుతడి పంటలు సాగు చేసుకునే రైతుల కోసం మినుము, జొన్న విత్తనాలను దిగుమతి చేసుకునేందుకు ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండలానికి 800 క్వింటాళ్ల మినుములు, 300 క్వింటాళ్ల జొన్న విత్తనాలు అవసరం కానున్నట్లు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసీ కాలువకు నీటి విడుదల ఆలస్యమవుతుందన్నారు. ఈ క్రమంలో వరి సాగు తగ్గే పరిస్థితులున్నాయన్నారు. రైతుల అవసరాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మినుము, జొన్న విత్తనాలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నామన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ అధికారి తెలియజేశారు.

ఆరుతడి పంటలను సాగుచేద్దాం

ఖాజీపేట మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలను సాగు చేద్దామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అబూబకర్ సిద్దిక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబర్ 15 వరకు ఖరీఫ్ సమయం ఉందని అంతవరకు చూద్దాం అన్నారు. లేని పక్షంలో ఆరుతడి పంటల సాగుకు కావాల్సిన చర్యలను చేస్తున్నట్లు తెలిపారు. ఖాజీపేట మండంలో 64 గ్రామాలకు మంచి నీరు అందాల్సి ఉండగా కేవలం 11 గ్రామాలకు మంచినీరు అందడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు చేయని కారణంగా సమస్య ఉందన్నారు. కాంట్రాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడా మంచినీటి కొరత ఉండకూడదన్నారు. మండలంలో 9 డీసీఎం గ్రాంటు నిధులు పనులు జరగలేదని పంచాయతీ రాజ్ ఏఈ వర ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే మంజూరైన పనులు రద్దు చేస్తామని వెంటనే పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. మండలంలో నిర్మాణంలోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్ల పనులు పూర్తి చేయాలని వాటిని సెప్టెంబర్ నెలలో ప్రారంభిస్తామని అధికారులు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. వచ్చేనెలలో పూర్తి చేసిన ఇంటి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు చెప్పారు. మండలంలో రెవెన్యూ అధికారులు చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. తుడుమలదిన్నె సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాకు మూడు తరాల నుంచి భూములు వస్తున్నాయి వాటికి ఎలాంటి డాక్యుమెంట్లు లేవు.. అధికారులు మాత్రం డాక్యుమెంట్లు ఉంటేనే చేస్తామని అంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు అనుభవం రికార్డుల ఆధారంగా చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏఓ సభ్యుల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మిడుతూరు వైద్య సిబ్బంది మండల సమావేశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని నిరుపేదలందరికి పక్కా ఇళ్లు

ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలంతోపాటు పక్కా ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఖాజీపేట మేజర్ పంచాయతీలో నాలుగవ రోజున బీసీ కాలనీ, ఈబీసీ కాలనీ, ఇందిరా కాలనీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ ఫలాలను వివరించారు. పథకాలు అందని వారి వివరాలను ఆరా తీశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, వైద్య ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అందరి క్షేమాన్ని ఆకాంక్షిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, చంద్రశేఖర్, బుజ్జి, శివరామిరెడ్డి, యెన్నం రాణెమ్మ, పల్లె యేసురత్నంతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాల దైవం బీపీమండల్

బద్వేలు అర్బన్ : వెనుకబడిన కులాల దైవం బింద్యేశ్వరి ప్రసాద్ మండల్ అని మండల్ ఆశయ సాధన సమితి కన్వీనర్ కె.రమేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తిలు పేర్కొన్నారు. బీపీమండల్ 105వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక శ్రీకృష్ణమందిరం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీపీమండల్ చేసిన కృషి ఫలితంగానే రిజర్వేషన్ల ప్రక్రియ అమలులోకి వచ్చిందన్నారు. తొలుత బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు బిసి రమణ, యాదవ ఉద్యోగం సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, శ్రీకృష్ణమందిరం అధ్యక్షుడు చెన్నయ్య యాదవ్, ట్రెజరర్ ప్రసాద్‌యాదవ్, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, బీసీ సంఘాల నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమణయ్య, నాగసుబ్బయ్య, దూళ్ళరమేష్ తదితరులు పాల్గొన్నారు.



బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వ పర్వదినంగా మొల్లమాంబ జయంతి



మొల్ల మందిరంలో మాట్లాడుతున్న హనుమంతరావు

గోపవరం : తెలుగు రామాయణ తొలి రచయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి ప్రతి ఏటా మార్చి 13వ తేదీన పర్వదినంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. ఇది మొల్ల సాహితీపీఠం, ఏపీ కుమ్మర శాలివాహన సంఘం ఘన విజయంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఏటా మార్చి 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ పండుగగా మొల్లమాంబ జయంతిని వైభవంగా నిర్వహించనున్నట్లు జీవో నెం.1969/2023ను ఈనెల 14వ తేదీన విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొల్ల సాహితీపీఠం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేసి హర్షం ప్రకటించారు. 2005 నుండి మొల్ల సాహితీపీఠం వివిధ రకాల చేసిన విజ్ఞప్తులను పరిశీలించి సీఎం ప్రత్యేక చొరవతో జీవో విడుదల చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో గోపవరంలో నిర్మించిన మొల్ల హరిత రెస్టారెంట్, పలు అభివృద్ధి పనులకు రూ.1.17 కోట్లు విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ ముస్లింల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనలు అనంతరం వివిధ మసీదుల నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ భారతీయులంతా గర్వించేలా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించారన్నారు. వారు భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేసి విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇమాంలు, ముస్లింలు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



వెంకటాద్రినగర్‌లో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని కోనసముద్రం పంచాయతీలోని కోనసముద్రం, వీరప్పల్లి పంచాయతీలోని రామాంజనేయనగర్, వెంకటాద్రి నగర్, ఆనందనగర్ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా బావించి సాగిస్తున్న పాలనతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ప్రతి 50 గడపలకు వాలంటీర్‌ను నియమించడంతో పాటు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చేలా పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయసుబ్బారెడ్డి, అనూష, సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మండల నాయకులు రాజగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమర భేరి పోస్టర్ల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై చేపట్టే సమర భేరి ఆందోళన పోస్టర్లను స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ ఊసే లేదని విమర్శించారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి చైతన్యం చేస్తూ ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, లక్ష్మయ్య, పవన్, బాషా, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.